సాక్షి సంగారెడ్డి

బుధవారం । 17 । జనవరి । 2024



పొట్లపల్లి.. భక్తి పరిఢవిల్లి

పొట్లపల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగాయి. భక్తులు పట్నాలు, బోనాలు నిర్వహించారు. వివరాలు 8లో ▸



పట్నం పేరిట వసూలు

కొమురవెల్లిలో ఒగ్గుపూజారులు పట్నం పేరిట డబ్బు వసూలుకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. వివరాలు 8లో ▸

ఒకరికి కరోనా



పటాన్‌చెరు: పట్టణం లోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఎనిమిది మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా ఒకరికి పాజిటివ్‌గా వచ్చింది. ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించలేదు.

న్యూస్‌రీల్

పిల్లలతో పనిచేయిస్తే చర్యలు

పటాన్‌చెరు: పిల్లలతో పని చేయిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గొల్లపల్లి రాములు అన్నారు. మంగళవారం మండల పరిధి కర్దనూర్ గ్రామ సమీపంలోని కార్ ఫోం వాష్ సెంటర్ వద్ద బాల కార్మికుడితో పని చేయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో యజమాని జయరాంరెడ్డి పై బీడీఎల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగిసిన సిద్ధివినాయక జయంత్యుత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి రేజింతల్ గ్రామ శివారులోని సిద్ధివినాయక ఆలయంలో జయంత్యుత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం, సామూహిక కల్యాణం, మహా మంగళ హారతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. చివరిరోజు తోగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ, ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు హాజరయ్యారు. వారి వెంట భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఐక్యంగా హక్కుల సాధన



కార్మికులతో కాటా శ్రీనివాస్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో పెన్నార్ పరిశ్రమ యూనియన్ నాయకులతో త్వరలో జరగనున్న యూనియన్ ఎన్నికల గురించి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారి శ్రీనివాసులు

సంగారెడ్డి టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా రవాణా అధికారి శ్రీనివాసులు అన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు రోడ్డు రవాణా వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, దేశంలో నిమిషానికి ఓ రోడ్డు ప్రమాదం జరుగుతుందన్నారు. ఇందుకు కారణం అతివేగమేనని, హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ నుంచే రాకపోకలు

నారాయణఖేడ్: ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లోని ఆర్టీసీ బస్టాండ్ నుంచే ఈ నెల 17 నుంచి బస్సుల రాకపోకలు కొనసాగుతాయని ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. ఖేడ్‌లోని రాజీవ్‌చౌక్ నుంచి ఉన్న రోడ్డు చిన్నగా ఉండి, చౌరస్తాలో ప్రైవేట్ వాహనాలు, తోపుడు బండ్ల వల్ల ఇబ్బంది ఎదురవుతుందన్నారు. దీనికితోడు బస్‌షెల్టర్, మూత్రశాలలు లేవన్నారు. ఆయా కారణాల దృష్ట్యా రాజీవ్‌చౌక్ నుంచి కాకుండా బస్టాండ్ నుంచే బస్సులు రాకపోకలు సాగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పంటల నమోదును వేగిరం చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్

అక్కన్నపేట(హుస్నాబాద్): వానాకాలం, యాసంగి సీజన్‌కు సంబంధించిన అన్ని రకాల పంటల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని నందారంలో మంగళవారం సీబీఈ యాప్‌లో పంటల నమోదుతో పాటు పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంటకోత దశలో తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. పంటల నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్న ఏఈఓలకు రైతులు సహకరించి వివరాలు తెలుపాలన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగరాజు, ఏఈఓ శేఖర్, రైతు అజ్మీర తిరుపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.





సంగారెడ్డిలో ముగ్గులు వేస్తున్న యువతులు, మహిళలు



గాలిపటం ఎగురవేస్తూ..

ఊరూరా.. సంక్రాంతి సంబురం

జిల్లావ్యాప్తంగా సంక్రాంతి పండుగను సంబురంగా జరుపుకున్నారు. చిన్నాపెద్ద ఆనందోత్సాహాల మధ్య వేడుకను నిర్వహించారు. ప్రతి ఇంటా సంతోషాల హరివిల్లు వెల్లివిరిసింది. పిండి వంటలు ఘుమఘుమలాడాయి. పిల్లలు నింగిని తాకేలా గాలిపటాలను ఎగురవేసి ఆనంద పడ్డారు. పర్వదినం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

టికెట్ ఫ్లైట్



జహీరాబాద్ అభ్యర్థిత్వం కోసం పోటాపోటీ

- 23 మంది నేతల విజ్ఞప్తులు
- ద్వితీయ శ్రేణి నాయకులు సైతం రేసులో..
- హైదరాబాద్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో జోరుగా వినతులు

పార్లమెంట్ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో టికెట్ల లొల్లి మొదలైంది. ప్రధానంగా బీజేపీలో ఇది కాస్త ఎక్కువగా ఉంది. జహీరాబాద్ నుంచి పోటీచేసేందుకు చాలామంది ఉత్సాహం చూపిస్తున్నారు. అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని అధిక సంఖ్యలో ఆశావహులు దరఖాస్తు చేసుకుంటున్నారు.

– సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం టికెట్ కోసం బీజేపీలో పదుల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఏకంగా 23 మంది నాయకులు తమ అభ్యర్థిత్వాలను పరిశీలించాలని కోరుతున్నారు. ఇందులో పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు కూడా ఎంపీ టికెట్ అడుగుతుండటం గమనార్హం. అభ్యర్థిత్వాన్ని కోరుతున్న వారిలో స్థానికేతర నేతలు కూడా ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధత కోసం కమలం పార్టీ ఇటీవల జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించింది. పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా నియమితులైన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి రమణారెడ్డి ఆధ్వర్యంలో జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్‌లతో ఇటీవల సన్నాహక సమావేశాలు జరిగాయి. అనంతరం హైదరాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో రెండు రోజుల క్రితం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన ఆశావహులు జహీరాబాద్ నుంచి టికెట్ ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలో మొత్తం 23 మంది విజ్ఞప్తులు చేశారు. టికెట్ ఆశిస్తున్నవారిలో మేడపాటి ప్రకాష్‌రెడ్డి, ఆలె భాస్కర్, మాజీ ఎంపీ బాగారెడ్డి కుమారుడు జైపాల్‌రెడ్డి ముందు వరుసలో ఉండగా, క్యాసినో నిర్వాహకుడిగా పేరున్న చీకోటి ప్రవీణ్ కుమార్, కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన మరో ఎన్‌ఆర్‌ఐ కూడా తమ పేరును పరిశీలించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో చిన్నా చితక నాయకులు కూడా ఉన్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి, కనీసం డిపాజిట్లు దేవుడెరుగు, ఓ కౌన్సిలర్‌కు వచ్చే టన్నీ ఓట్లు కూడా సాధించలేని ఓ అభ్యర్థి.. ఇప్పుడు మళ్లీ తన పేరును జహీరాబాద్ ఎంపీ స్థానానికి పరిశీలించాలని కోరడం కమలం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. పార్టీ అభ్యర్థిత్వం దక్కితే.. ఎంతో కొంత పార్టీ ఫండ్ వస్తుందని, దానిలో నుంచి కొంత వెనుకేసుకోవచ్చనే పక్కా ప్రణాళికతో కొందరు నేతలు ఉన్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే ఫార్ములాను అవలంబించిన ఆ నాయకుడు ఇప్పుడు ఈసారి కూడా ప్రయత్నాలు సాగిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

నాయకత్వ సమస్య..

జహీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీకి పార్లమెంట్ స్థాయిలో బలమైన నాయకుడు లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన మేరకు ఓట్లు రాకపోయినప్పటికీ, లోక్‌సభ ఎన్నికలకు వచ్చే సరికి బీజేపీకి ఓటింగ్ శాతం భారీగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో గతంలో కంటే ఎక్కువ ఎంపీ స్థానాలను బీజేపీ గెలుచుకుంటుందని అంచనా వేస్తున్నారు. కమలం పార్టీకి ఓటర్లు ఉన్నప్పటికీ జహీరాబాద్ నియోజకవర్గంలో గట్టి నాయకత్వం లేకపోవడం ఈ ఎన్నికల్లో ఇబ్బందిగా మారింది. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యర్థి పార్టీలకు దీటైన నాయకుడు లేడు. దీంతో రానున్న పార్లమెంట్ ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై ఆ పార్టీ అధినాయకత్వం తర్జనభర్జన పడుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో బీజేపీ ఘోర పరాజయం పాలైన విషయం విదితమే. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులకు డిపాజిట్లు దక్కలేదు. కొందరు అభ్యర్థులైతే కనీస ఓట్లు సాధించలేదు. దీంతో కమలం పార్టీ పరువును బజారు పాల్జేశారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఒకటీ రెండు మినహా మిగిలిన అన్ని చోట్ల ఆ పార్టీ పరి స్థితి ఇలాగే ఉంది. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నాయకత్వ సమస్య ఆ పార్టీని ప్రధాన ప్రతిబంధకంగా మారనుందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

అభివృద్ధి పనుల్లో నాణ్యత

కలెక్టర్ క్రాంతి ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్: ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు చేర్పులకు అవకాశం కల్పిస్తూ జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో ఈ నెల 20, 21 తేదీలలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ క్రాంతి తెలిపారు. వాటిని ప్రజలు, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరాల గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులపై శాఖల వారీగా సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, పీహెచ్‌సీలు, ఎంసీహెచ్, సబ్ సెంటర్ల నిర్మాణాలు, మన ఊరు -మనబడి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులతో చేపట్టిన పనులను ఎన్నికల కోడ్ లోపు ప్రారంభించాలని తెలిపారు. జరుగుతున్న పనులు నాణ్యతగా ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఓ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ గాయత్రీ దేవి పాల్గొన్నారు.

తండాలో 'పాత పంటల' సందడి



సిద్ధపూర్‌లో ఎడ్ల బండ్లకు స్వాగతం పలుకుతున్న గిరిజనులు

జహీరాబాద్ టౌన్: డీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పాత పంటల జాతర మంగళవారం కోహీర్ మండలం సిద్దాపూర్ తండాకు చేరుకుంది. జాతర ఎడ్ల బండ్లు రావడంతో గిరిజనులు ఘనస్వాగతం పలికారు. సర్పంచ్ సుశీల బాయి వాటికి పూజలు నిర్వహించారు. అనంతరం తండాలో బండ్ల ఊరేగింపు నిర్వహించగా పిల్లలు, మహిళలు ఆట పాటలతో సందడి చేశారు. పాత పంటల జాతర చూసేందుకు హైదరాబాద్ నుంచి 10 మంది విజిటర్స్ వచ్చారు. ఈ సందర్భంగా డీడీఎస్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలు భుజించాలని, వీటితో ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. డీడీఎస్‌లో ఆధ్వర్యంలో మహిళా రైతులు పలు రకాల చిరుధాన్యాలు సాగుచేస్తున్నారని వివరించారు. సిద్దాపూర్ తండా వాసులు మొదటి సారి 40 ఎకరాల్లో పండిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భీంసింగ్, డీడీఎస్ సిబ్బంది చంద్రమ్మ, లక్ష్మమ్మ, పూలమ్మ, చుక్కమ్మ, చిన్న నర్సమ్మ, మంజుల, వినయ్, బాలయ్య పాల్గొన్నారు.

వైభవంగా స్వర్ణాభరణాల ఊరేగింపు



సదాశివపేటలో అయ్యప్ప స్వర్ణాభరణాల ఊరేగింపు

సదాశివపేట(సంగారెడ్డి): శబరిమల అయ్యప్ప ఆలయంలో మకర సంక్రాంతి రోజున నిర్వహించే మకర జ్యోతి దివ్యదర్శన ఉత్సవాల మాదిరిగా సదాశివపేటలో సోమవారం అయ్యప్ప స్వర్ణాభరణాల ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని సంగమేశ్వర ఆలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ అయ్యప్ప మందిరం వరకు కొనసాగింది. ఇందులో అయ్యప్పల ఆటపాటలు, ప్రత్యేక డోలు వాయిద్యాలు, మహిళల కోలాటాలు అలరించాయి. ప్రత్యేక రథంపై ఊరేగింపుగా తీసుకెళ్లిన అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు, గురుస్వాములు పాల్గొన్నారు.

మల్లన్న బండ.. ఆధ్యాత్మిక కొండ

మిరుదొడ్డి(దుబ్బాక): మల్లన్న బండ జాతరకు భక్త జనం పోటెత్తారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా వీరారెడ్డిపల్లి, జంగపల్లి శివారులో సహజ సిద్ధంగా వెలసిన 120 గజాల ఎత్తు 90 ఎకరాల విశాలమైన బండపై జాతర వైభవంగా జరిగింది. జాతరలో పల్లె సంస్కృతీ సంప్రదాయలు వెల్లివిరిశాయి. భక్తులు బోనాలను డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. బండ సొరికెలో వెలిసిన స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు.



పెద్ద పట్నం ముందు ఒగ్గు కథ ఆలపిస్తున్న జంగం కొమురయ్య బృందం

తెగుళ్ల దిగులొద్దు

- సస్యరక్షణ చర్యలతో శనగ అధిక దిగుబడి
- పూత దశలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి
- జిల్లాలో 13,500 ఎకరాలలో సాగు

మునిపల్లి(అందోల్): వానాకాలం సీజన్‌లో శనగ పంటను రైతులు అధికంగా సాగు చేస్తారు. పంట రక్షణకు సకాలంలో చర్యలు చేపట్టకపోతే పచ్చ పురుగులు, వేరు ఎండు తెగులు పంటను సోకుతాయి. దీని వల్ల దిగుబడులు తగ్గిపోతాయి. అయితే ఈ సమయంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను గ్రామాల్లో మండల వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారని జిల్లా వ్యవసాయ ధికారి పేర్కొన్నారు.

ఎండుతెగులు

నేలలో ఈ శిలీంద్రం అన్ని దశల్లో విస్తరించి నష్టం కలిగిస్తుంది. ముఖ్యంగా కాయ దశలో ఎక్కువగా ఆశిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్, లేదా ప్రొకొనాజోల్ 2.5 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

పచ్చ పురుగు

ఇవి మొక్కల లేత భాగాన్ని తినడంతో ఎదుగుదల ఆగిపోతుంది. నివారణకు లీటరు నీటికి క్లోరిఫైరిఫాస్ 2 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి. పంట పూత దశలో నీటి ఎద్దడికి గురి కాకుండా చూడాలి. కలుపును సకాలంలో తొలగిస్తే మంచి దిగుబడి సాధించవచ్చు.



జిల్లాలో 2 లక్షల 24 వేల హెక్టార్ల పై చిలుకు భూమి సాగులో ఉంది. ఇందులో సుమారు 13,500 ఎకరాల్లో శనగ పంట సాగవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

> **అవగాహన కల్పిస్తున్నాం**
>
> 
>
> పంటకు పట్టిన చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సస్యరక్షణలో ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయాధికారులను సంప్రదిస్తే పంటలను పరిశీలించి సూచనలు ఇస్తారు. జిల్లాలో 13,500 ఎకరాలలో శనగ పంట సాగు చేస్తున్నారు. బోరు బావులు, మోటర్ల కింద మరో వెయ్యి ఎకరాలలో సాగయ్యే అవకాశం ఉంది.
>
> – నర్సింగ్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

పని దొరకలేదని..


మొగులయ్య (ఫైల్)

వట్‌పల్లి(అందోల్): పని దొరక్క ఓ వ్యక్తి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన అందోలు మండలం పోసానిపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెట్టు కింది మొగులయ్య (40) సెంట్రింగ్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటి అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. అవి తీర్చేందుకు పని దొరకక పోవడంతో ఖాళీగా ఉంటున్నాడు. అప్పుల తీర్చే మార్గం కానరాక తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని జోగిపేట ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యక్తి అదృశ్యం


ఓం ప్రకాశ్(ఫైల్)

జిన్నారం (పటాన్‌చెరు): ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. గుమ్మడిదల ఎస్‌ఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం.. గుమ్మడిదల మండలం అన్నారం గ్రామానికి చెందిన ఓంప్రకాశ్ ఈనెల 12న ప్రగతినగర్‌లోని తన స్నేహితుల ఇంటికి వెళ్తానని భార్య స్రవంతికి చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి నేటి వరకు ఇంటికి రాకపోవటంతో ఆమె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఓం ప్రకాశ్‌కు సంబంధించి ఎవరికైనా తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

ఉసురుతీసిన ఆర్థిక గొడవలు

- కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

జిన్నారం (పటాన్‌చెరు): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. సీఐ నయీముద్దీన్ కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని మయూరీబుల్ జిల్లా, లావణ్యదేవీపూర్ గ్రామానికి చెందిన మూచీరాసింగ్ హన్సుద(25) బొల్లారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఆర్థిక విషయాల్లో ఏడాది కాలంగా భార్యతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 15న కూడా ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన హన్సుద.. ఖాజీపల్లిలోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తులో ఉంది.

కుక్కల దాడిలో గొర్రెల మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

మద్దూరు(హుస్నాబాద్): కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన మండల కేంద్రంలో చోటు చేసేకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నంగి కొమురయ్య గొర్రెల కాపరి. ఎప్పటి మాదిరిగానే సోమవారం సాయంత్రం దొడ్డిలో గొర్రెల మందను తోలుకొని వెళ్లాడు. రాత్రి దొడ్డిలోకి కుక్కలు చొరబడి మందపై దాడి చేయగా.. సుమారు 20 గొర్రెలు మృతి చెందగా, మరో 10 గొర్రెలను గాయపర్చాయి. తనకు సుమారు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఉప కమిషనర్

జహీరాబాద్ టౌన్: రోడ్డు భద్రత గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఉమ్మడి జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ సీహెచ్.శివలింగయ్య పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి ఫిబ్రవరి 15 వరకు కొనసాగే రోడ్డు భద్రత వారోత్సవాలను జహీరాబాద్ మండలంలోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రచార వాహనానికి జెండా ఊపారు. అనంతరం మాట్లాడుతూ అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనదారులు రూల్స్ పాటించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు జీవీ శ్రీనివాస్ గౌడ్, నరేంద్ర నాయక్ పాల్గొన్నారు.


బోనంతో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


అగ్నిగుండం దాటుతున్నభక్తులు

పొట్లపల్లి.. భక్తి పరిఢవిల్లి..

- వైభవంగా మల్లికార్జుస్వామి బ్రహ్మోత్సవాలు
- బోనాలతో తరలి వచ్చిన మహిళలు
- అగ్నిగుండంపై నడిచిన భక్తులు

హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగాయి. శివకల్యాణంతో ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం బోనాలు, పట్నాలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారు జామున అగ్ని గుండంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. సంక్రాంతి రోజున ఎడ్ల బండ్ల ఊరేగింపు కనుల పండువగా సాగింది. చుట్టు పక్కల గ్రామాలే కాక జిల్లా నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కలు సమర్పించారు. ప్రజలందరూ బాగుండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ బండ్లు, ట్రాక్టర్లతో అలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో అలయ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి ఘట్టమైన అగ్ని గుండం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి కటాక్షం కోసం భక్తులు అగ్ని గుండంపై నడిచేందుకు ఉత్సాహం చూపించారు. ఈ ఉత్సవాల్లో సర్పంచ్ సుశీల, వైస్ ఎంపీపీ నిర్మల, ఉపసర్పంచ్ సకీబాబ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

రంగనాయక సాగర్‌లోకి నీటిని వదలాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో రైతులు మంగళవారం ఇరిగేషన్ ఈఈ గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గంలో రైతులు సాగుచేస్తున్న పంటలు ఎండిపోతున్నాయని, రంగనాయక సాగర్‌లోకి నీటిని విడుదల చేసి కాలువల ద్వారా చెరువులునింపి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి నాయిని నర్సింహారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.


ఈఈకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సీఆర్పీల వేతన వెతలు

- కనీస వేతనం కోసం ఎదురుచూపు
- విధుల్లో 103 మంది
- ఆంధ్ర తరహాలో జీతాలు చెల్లించాలని డిమాండ్

సీఆర్పీలు కనీస వేతనాలు, ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగస్తులతో సమానంగా పనిచేస్తున్నా గానీ అరకొర వేతనంలో బతుకు బండిని సాగదీస్తున్నారు. సర్కారు స్కీంల అమలులో సైతం వారి పాత్ర ఏమాత్రమూ తీసికట్టు కాదు. ఇలా అన్నింటా వారై వ్యవహరిస్తూ ప్రజలకు విస్తృత సేవలను అందజేస్తున్నారు.


బడిఈడు బయట పిల్లల గుర్తింపు సర్వేలో పాల్గొన్న సీఆర్పీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పాఠశాల విద్యా శాఖ కార్యక్రమాల అమలులో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ల (సీఆర్పీ)దే కీలకపాత్ర. విధులకు గైర్హాజరైతే కాంప్లెక్స్ పరిధిలోని అనేక పనులకు ఆటంకం తప్పదు. జిల్లాలో కాంట్రాక్ట్ పద్ధతిలో 103 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. బడిబయట పిల్లలను బడిలో చేర్పించటం, కాంప్లెక్స్ పరిధిలోని 18 పాఠశాలల పర్యవేక్షణ, ఎస్ఎంసీ సమావేశాలు, ఏకోపాధ్యాయ పాఠశాలలో విధుల నిర్వహణ, మధ్యాహ్న భోజన అమలు పరిశీలన, సమగ్ర శిక్షా కార్యక్రమాల నిర్వహణ, మండల వనరుల కేంద్రానికి పాఠశాలలకు అనుసంధాన కర్తగా, హరితాహారం అమలులో భాగస్వామ్యం, ప్రభుత్వ పాఠశాలల్లో సన్న బియ్యం సరఫరాకు సహకారం, స్వచ్ఛ విద్యాలయ-స్వచ్ఛభారత్‌లో భాగస్వామ్యం, విద్యార్థుల ఆధార్ నమోదు కార్యక్రమం, వేసవి బడుల నిర్వహణ, ఎలక్షన్ డ్యూటీ, బాలికలకు హైజీన్ కిట్స్ పంపిణీ, తదితర కార్యక్రమాల్లో కీలక పాత్ర వీరిదే.

ఇవి డిమాండ్లు

కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులకు మధ్య వారధిలా సీఆర్పీలు విధులు నిర్వహిస్తుంటారు. కొన్ని సందర్భాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలల ఉపాధ్యాయులు గైర్హాజరైతే విద్యార్థులకు బోధన కూడా చేస్తారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తుంటారు. ''అయినా వేతనాలు వారితో పోలిస్తే సమానంగా లేవు. పక్కనున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీఆర్పీలకు నెలకు రూ.23,500 ఇస్తోంది. మాకూ ఇదే తరహాలో చెల్లించాలి. మమ్మల్ని రెగ్యులర్ చేయాలి. పెరిగిన నిత్యావసర ధరలకనుగుణంగా వేతనాలు ఇవ్వాలి. కాంప్లెక్స్ పాఠశాలల పరిధిలో రవాణా చార్జీలు సైతం భరించాల్సి వస్తోంది. ఆధార్ అనుసంధానం తదితర ఆన్‌లైన్ కార్యక్రమాలకు ఇంటర్నెట్‌కు కూడా మా సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. కానీ ప్రభుత్వం తిరిగి చెల్లించడంలేదు'' అని పేర్కొంటున్నారు. దీంతో హెచ్ఆర్ పాలసీని కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కావాలంటున్నారు.

పనిభారం ఎక్కువే



రోజు మాకు పనిభారం అధికమే. ప్రతి ప్రభుత్వ పథకాలతో పాటుగా పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమాల్లో మేము ముందుండాల్సిందే. కానీ వేతనాలు మాత్రం తక్కువే. మాకు కూడా సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి.

– క్రాంతి కుమార్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సీఆర్పీ సిద్దిపేట

రెగ్యులర్ చేయాలి



ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నాం. ఏకోపాధ్యాయ పాఠశాలలు, కాంప్లెక్స్ పాఠశాల పరిధిలోని 18 పాఠశాలల్లో సమయానుకులంగా విద్యార్థులకు బోధన కూడా చేస్తున్నాం. ప్రతి ప్రభుత్వ పథకాలలో మమ్మల్ని భాగస్వామ్యం చేస్తున్నారు. కాగా ఇప్పటికైనా సీఆర్పీలను రెగ్యులర్ చేయాలి.

– జయలక్ష్మి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, సీఆర్పీ సిద్దిపేట

పండగపూట విషాదం

- విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి
- గాలిపటం ఎగురేస్తుండగా ఘటన


శివకుమార్(ఫైల్)

ఝరాసంగం(జహీరాబాద్): సంక్రాంతి పండుగ వేళ గ్రామంలో విషాదం నెలకొంది. సరదాగా సంతోషంతో గాలిపటం ఎగురేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పొట్టిపల్లికి చెందిన బి.శివకుమార్(22) హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్నాడు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో సొంత గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం గాలిపటం ఎగురేస్తున్నాడు. ఇంటిపైనే ఉన్న విద్యుత్ తీగకు గాలిపటం ఇరుక్కుంది. దాన్ని తీసే క్రమంలో ప్రమాదవశాత్తు తీగలు తగిలి షాక్ కొట్టింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, యువకుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కేసు దర్యాప్తులో ఉంది.

పోలీసులపై దాడి

నలుగురి అరెస్టు.. మరో ఇద్దరు పరారీ


మాట్లాడుతున్న సీఐ రాజు, వెనుకాల నిందితులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్‌లో విధుల్లో ఉన్న పోలీసులపై దాడి చేసిన ఘటనలో నలుగురిని అరెస్టు చేశామని, ఇద్దరు పరారీలో ఉన్నారు. పట్టణ సీఐ రాజు కథనం ప్రకారం.. పస్తాపూర్ పంచాయతీ కార్యాలయం సమీపంలో గొడవ జరుగుతుందని సోమవారం రాత్రి 100కు ఫోన్‌కాల్ వచ్చింది. రక్షక్ విధుల్లో ఉన్న హెచ్‌సీ తిరుపతి మరో ఇద్దరు కానిస్టేబుళ్లను వెంటబెట్టుకుని అక్కడి వెళ్లారు. గొడవ పెద్దదికావడంతో హెచ్‌సీ తిరుపతి బ్లూకోర్ట్ డ్యూటీలో ఉన్న వారికి సమాచారం అందించారు. కానిస్టేబుల్ శ్రీనివాస్, హోంగార్డు అశోక్ స్పందించి వెంటనే పస్తాపూర్‌కు వచ్చారు. గొడవపడుతున్న వారిని నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా.. అదే గ్రామానికి చెందిన గౌస్‌షా, కాలపల్లి మోజేస్, ప్రవీణ్, చాకలి శ్రీను, సిరాజ్, జనార్ధన్ వారితో వాగ్వాదానికి దిగారు. హెచ్‌సీ తిరుపతి దగ్గర ఉన్న లాఠీని తీసుకుని శ్రీనివాస్ అనే వ్యక్తి కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను కొట్టాడు. దుర్భాషలాడుతూ మిగతా పోలీసులపై దాడికి యత్నించారు. కానిస్టేబుల్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి కేసు నమోదు చేశారు. విధులను ఆటంకపరచడం, పోలీసులపై దాడి చేసినందుకు ఆరుగురిపై కేసునమోదు చేశామని, గౌస్‌షా, మోజేస్, ప్రవీణ్, శ్రీనివాస్‌లను అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ చేశామన్నారు. జడ్జి వారికి 14 రోజుల రిమాండ్ విధించారని, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని సీఐ రాజు వివరించారు.

చెరకు తోట దగ్ధం


దగ్ధమవుతున్న చెరకు తోట

జహీరాబాద్ టౌన్: కొత్తూర్(బి)లో జరిగిన అగ్నిప్రమాదంలో ఐదెకరాల చెరకు తోట దగ్ధమైంది. బాధితుల కథనం ప్రకారం.. కొత్తూరుకు చెందిన చంద్రన్న, వినోదమ్మ, ప్రేమలమ్మ మల్కాపూర్‌కు చెందిన రాములు, మల్లమ్మ పొలాలు ఒకే దగ్గర ఉన్నాయి. వీరంతా చెరకు పంటను పండిస్తున్నారు. పొలంపై నుంచి కరెంట్ తీగలు వెళ్లడం.. అవి వేలాడుతుండగా షాట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మంటలు తోటలకు వ్యాపించగా వెంటనే రైతులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ వచ్చి సరికి చెరకు తోట కాలిపోయి పంట దెబ్బతింది. తమను ఆదుకోవాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

కల్వర్టును ఢీకొన్న కారు

వృద్ధురాలి మృతి, దంపతులకు గాయాలు


కమలమ్మ మృతదేహం

అక్కన్నపేట(హుస్నాబాద్): ఓ కారు అతివేగంగా దూసుకెళ్లి కల్వర్టును ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఈ సంఘటన అక్కన్నపేట మండల కేంద్రం శివారులో చోటుచేసుకుంది. ఎస్సై తాండ్ర వివేక్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు నుంచి కరీంనగర్‌కు ఏపీ15బిఎస్ 3357నంబర్ గల కారులో గన్నెపూడి అభేదజ్ఞగో భార్య రేణుక అత్త కమలమ్మ బయలుదేరారు. సోమవారం అర్ధరాత్రి అక్కన్నపేట మండల కేంద్రం శివారులోకి రాగానే కారు అదుపుతప్పి కల్వర్టును ఢీ కొనడంతో పల్టీలు కొట్టింది. దీంతో కమలమ్మ(84) మృతి చెందగా.. రేణుక కాలు విరిగింది. అలాగే అభేదజ్ఞగోకు స్వల్పంగా గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 అంబులెన్స్ సహాయంతో హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



● గ్యారంటీల ముగ్గు

సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని మహిళలు ఇళ్ల ముందు ఆకర్షణీయంగా ముగ్గులు వేశారు. మండలంలోని ముర్కుంజాల్, ఘన్‌పూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీపై వేసిన ముగ్గులు, అలాగే.. అయోధ్యలో రామాలయం నిర్మాణం సందర్భంగా వేసిన శ్రీరాముడి ముగ్గు అందరిని ఆకర్షించాయి.

– కంగ్టి (నారాయణఖేడ్)

పట్నం పేరిట వసూలు

కొమురవెల్లిలో ఒగ్గుపూజారుల తీరు

- చైర్మన్ హెచ్చరించినా కానరాని మార్పు
- అధిక వసూలుపై భక్తుడి ఫిర్యాదు
- ఒగ్గు పూజారిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగింపు

కొమురవెల్లి(సిద్దిపేట): వచ్చే ఆదివారం నుంచి కొమురవెల్లి మల్లికార్జున స్వామి జారత ప్రారంభం కానునుంది. దీనికి ముందే ఆలయంలో ఒగ్గు పూజారులు కట్నం పేరుతో వసూళ్లకు తెర లేపారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు చెల్లించే సమయంలో పట్నాలు వేయడం ఆనవాయితీ. వీటిని ఒగ్గు పూజారులు వేస్తారు. స్వామి వారికి చెలుక, నజరు పట్నం, ముఖ మండపం పట్నాలను వేస్తారు. చెలుక పట్నానికి రూ100, నజరు పట్నానికి రూ.150, ముఖ మండప పట్నానికి 250 టికెట్ల రూపంలో ఆలయం వసూలు చేస్తుంది. ఇందులో ఒగ్గుపూజారులకు యాభై శాతం చెల్లిస్తుంది. అయితే ప్రతీ పట్నం పై ఒగ్గు పూజారులు రూ.500 నుంచి రూ. 2000 వరకు బలవంతంగా కట్నం పేరుతో అదనంగా వసూలు చేస్తున్నారని ఆలయ అధికారులకు భక్తులు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. నూతనంగా ఏర్పడిన పాలక మండలి ఇటీవల నిర్వహించిన పరిచయ కార్యక్రమంలో చైర్మన్ పార్పటకం లక్ష్మారెడ్డి ఒగ్గు పూజారులను భక్తుల వద్ద అధిక డబ్బులు వసూలు చేయరాదని, అలా చేస్తే విధుల నుంచి తప్పిస్తామని కూడా హెచ్చరించారు. అయినా కొంత మందిలో మార్పు రాలేదు. ఆదివారం ఒగ్గు పూజారి జింకల బుచ్చయ్య అదనంగా రూ.500 కట్నం ఇస్తేనే పట్నం వేస్తామని దురుసుగా ప్రవర్తించాడని కరీంనగర్ కు చెందిన భక్తుడు జనార్ధన్ ఆలయ ఈఓకు ఫిర్యాదు చేశారు. వెంటనే అధికారులు సదరు ఒగ్గుపూజారిని వారం రోజుల పాటు విధుల నుండి తొలగించారు. జాతరకు వచ్చే భక్తులను ఒగ్గు పూజారులు ఇబ్బంది కలిగించకుండా ఆలయ అధికారులు, పాలక మండలి పర్యవేక్షించాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తప్పవు



ఆలయంలో భక్తులకు ఇబ్బంది కలిగించే వారిపై చర్యలు తీసుకుంటాం. ఒగ్గు పూజారులను మూడు రోజుల క్రితమే హెచ్చరించాం. అయినా మారక పోవడం బాధాకరం. పాలక మండలిలో చర్చించి తప్పు చేసిన వారు ఎంతటి వారైన ఉపేక్షించేది లేదు.

– లక్ష్మారెడ్డి, ఆలయ చైర్మన్


పట్నాలు వేస్తున్న భక్తులు